క్లుప్తంగా

మధ్యాహ్న భోజనం పరిశీలన



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఈఓ

కొత్తగూడెంఅర్బన్: రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరచారి తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన అమలు తీరును పరిశీలించి, విద్యార్థులు, హెచ్ఎంతో కలిసి భోజనం చేశారు. మెనూ ప్రకారం భోజనాలు వడ్డిస్తున్న వర్కర్లను, హెచ్ఎం, మండల విద్యాధికారి ఎం.ప్రభుదయాల్‌ను ప్రశంసించారు.

సుజాతనగర్‌ను కార్పొరేషన్ చేయొద్దు..

సుజాతనగర్: సుజాతనగర్‌ను కార్పొరేషన్‌గా చేయాలనే ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి వీర్ల రమేష్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సుజాతనగర్ ఉమ్మడి పంచాయతీని కార్పొరేషన్‌గా చేయాలన్న ప్రతిపాదన సరికాదని, పూర్తి గ్రామీణ ప్రాంతం కావడంతో వ్యవసాయ కూలీలు ఉన్నారని తెలిపారు. కార్పొరేషన్‌గా చేస్తే ప్రజలపై భారం పడుతుందని పేర్కొన్నారు. చప్పిడి వెంకటేశ్వర్లు, కాట్రాల తిరుపతిరావు, నల్లగొప్పు పుల్లయ్య, ఉడుగుల శ్రీకాంత్ పాల్గొన్నారు.

రేపు న్యాయ విజ్ఞాన తరగతులు

కొత్తగూడెంటౌన్: అఖిల భారత న్యాయవాదుల సంఘం (ఏఐఎల్‌యూ) ఆధ్వర్యంలో శనివారం జరగనున్న న్యాయ విజ్ఞాన తరగతులను విజయవంతం చేయాలని ఏఐఎల్‌యూ జిల్లా కమిటీ గురువారం ఒక ప్రకటనలో కోరారు. కొత్తగూడెం బార్ అసోసియేషన్ సౌజన్యంతో బార్ అసోసియేషన్ హాల్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ అవగాహన తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు కోరారు.

వరిలో ఎండు తెగులు

సుజాతనగర్: వరి పంటలో బ్యాక్టీరియా ఎండు తెగులు ఆశించినట్లు మండల వ్యవసాయాధికారిణి గాండ్ల నర్మద తెలిపారు. ఈ మేరకు పంట పొలాలను సుజాతనగర్‌లో గురువారం ఆమె పరిశీలించారు. మాట్లాడుతూ... వాతావరణంలో మార్పుల కారణంగా పంటలకు తెగులు ఆశించినట్లు చెప్పారు. తెగులు సోకిన ఆకులపై పసుపు రంగు మచ్చలు ఏర్పడతాయని, ఇవి ఆకు అంచుల నుంచి క్రమేపీ మొదలు వరకు వ్యాపిస్తాయన్నారు. ఆకుల అంచులు పూర్తిగా ఎండిపోయి మధ్య భాగం ఆకుపచ్చగా ఉంటుందన్నారు. ఈ తెగులు నివారణకు తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలని చెప్పారు. నత్రజని ఎరువులను నియంత్రించుకుంటూ సిఫారసు చేసిన మేరకే వాడాలన్నారు. నివారణకు ఎకరానికి 80 గ్రాముల అగ్రిమైసిన్ లేదా 40 గ్రాముల ప్లాంటోమైసిన్‌ను 600 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్‌తో కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించండి..

సుజాతనగర్: సుజాతనగర్ గ్రామ పంచాయతీ అంబేడ్కర్‌నగర్‌లో ఇళ్ల మధ్యలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని మాదిగ ఐక్య వేదిక నాయకులు వేల్పుల భాస్కర్ డిమాండ్ చేశారు. కాలనీ వాసులతో గురువారం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద నిరసన తెలిపారు. మాట్లాడుతూ.. ట్రాన్స్‌ఫార్మర్ నుంచి తరచు నిప్పురవ్వలు పడుతుండటంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నట్లు చెప్పారు. అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని విన్నవించారు.

పంటలన్నింటినీ ప్రభుత్వమే కొనాలి

ఇల్లెందురూరల్: రైతు పండించిన పంటలన్నింటినీ ప్రభుత్వమే కొనుగోలు చేసి గ్రామాలలో ప్రైవేటు వ్యాపారుల మోసాలను అరికట్టాలని అఖిల భారత రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బుర్ర వెంకన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో సంఘం ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు చేతికి అందే దశలో అతి తక్కువ ధర చెల్లించి చిల్లర వ్యాపారులు మోసం చేస్తున్నారని వాపోయారు. ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు. ఇల్లెందు మార్కెట్ యార్డులో సీసీఐ ద్వారా పత్తి, మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను తక్షణం ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

ఆలయ వార్షికోత్సవం

జూలూరుపాడు: వెంగన్నపాలెం శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయ 22వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి, మంగమ్మ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ప్రభుత్వ స్థలాలు ఉన్నాయా?

- ఏళ్లుగా రెవెన్యూ స్థలాలకు కొరవడిన రక్షణ
- సింగరేణికి అప్పగించిన లీజు స్థలాలపై వీడని అస్పష్టత
- అధికారుల వైఫల్యం వల్లే ఈ దుస్థితి
- జిల్లాలో ప్రశ్నార్థకంగా సమీకృత గురుకులాల నిర్మాణం



ఇల్లెందు తహసీల్దార్ కార్యాలయం

ఇల్లెందురూరల్: కంచే చేను మేసిందో.. విక్రయించిందో.. అక్రమణదారులు జొరబడినప్పుడు కళ్లు మూసుకుందో.. తెలియదు కానీ.. ప్రభుత్వ స్థలాలు ఎక్కడున్నాయో.. వెతుక్కోవాల్సిన దుస్థితి నేడు జిల్లాలోని పలు మండలాల్లో నెలకొంది. అందుబాటులో ఉన్న భూములను పరిరక్షించాల్సిన బాధ్యతను రెవెన్యూ అధికారులు విస్మరించడం వల్లే జిల్లా ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఉన్నతమైన నిర్మాణాల కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొంది.

అడ్రస్ లేని ప్రభుత్వ భూములు...

గత ప్రభుత్వం ఆదేశంతో క్షేత్రస్థాయి అధికారులు చేపట్టిన సమగ్ర భూరికార్డుల ద్వారా జిల్లా వ్యాప్తంగా భూముల వివరాలను అధికారులు సేకరించారు. దీనిప్రకారం ఇల్లెందు మండలంలో మొత్తం 98,677.18 ఎకరాల భూ విస్తీర్ణం ఉంది. అందులో పట్టా భూమి 17,523.35 ఎకరాలు కాగా ప్రభుత్వ భూమి 81,153.23 ఎకరాలుగా నమోదైంది. ప్రభుత్వ భూమిలో 61,831.16 ఎకరాలు అటవీభూమిగా నిర్ధారించారు. ఇక మిగిలిన ప్రభుత్వ భూమి 19,322 ఎకరాల్లో ప్రభుత్వ సంబంధిత నిర్మాణాలకు, అసైన్‌మెంట్‌కు కేటాయించని భూములు, ఆక్రమణలు, వివాదాలకు సంబంధించిన భూములు పోను మొత్తంగా వెయ్యి ఎకరాల ప్రభుత్వ భూమి, 1,417.15 ఎకరాలు వ్యవసాయానికి పనికిరాని భూమి, 4,075.23 ఎకరాల విస్తీర్ణంలో వ్యవసాయేతర భ్రష్టు భూమి ఉన్నట్లు రెవెన్యూ రికార్డుల్లో నమోదైంది. కానీ నేడు చూద్దామన్నా ఎక్కడా ఒక్క ఎకరం కూడా అందుబాటులో లేదు. ఇది ఒక్క ఇల్లెందు మండలంలోనే కాదు.. జిల్లా వ్యాప్తంగా నెలకొంది.

సమీకృత గురుకులాలకు స్థలాభావం...

బీసీ, ఎస్సీ, మైనారిటీ గురుకులాలన్నింటినీ సుమారుగా 25ఎకరాల విస్తీర్ణంలో ఒకే కాంపౌండ్‌లో నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. దీనికోసం అన్ని నియోజకవర్గ కేంద్రాలలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. కానీ క్షేత్రస్థాయిలో 25ఎకరాల విస్తీర్ణంలో ఖాళీగా స్థలాలు కోసం అన్వేషించాల్సిన దుస్థితి అధికారులకు తప్పడం లేదు.

నిర్మాణాలకు వీడని గ్రహణం...

మండలంలో ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలైన డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి నేడు స్థలం కొరత తీవ్రస్థాయిలో ఉంది. ఇక మండలానికి మంజూరైన మైనారిటీ, ఎస్సీ, బీసీ గురుకులాల్లో నేడు స్థానికంగా అద్దె భవనాల కొరత వల్ల మైనారిటీ గురుకులం మాత్రమే ఇల్లెందులో కొనసాగుతోంది. బీసీ గురుకులం ఖమ్మంలో, ఎస్సీ గురుకులం కారేపల్లి మండలంలో కొనసాగుతున్నాయి. మైనారిటీ, ఎస్సీ గురుకులాల భవన నిర్మాణం కోసం ఆరేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కానీ నేటి వరకు ఆయా గురుకులాల నిర్మాణం కోసం అవసరమైన స్థలాలను చూపించడంలో రెవెన్యూ అధికారులు విఫలమయ్యారు.

ఆక్రమణలకు ఊతమిస్తున్న ఉదాసీనత..

ఇల్లెందు మండలంలో ప్రభుత్వ స్థలం వెయ్యి ఎకరాలు ఉన్నట్లు రెవెన్యూ రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. అంతేకాకుండా సింగరేణి సంస్థ సుమారు దశాబ్దకాలంగా తన లీజు పరిధిలోని భూములను తిరిగి రెవెన్యూ శాఖకు అప్పగించింది. ఇందులో అత్యధిక భాగంలో నిర్మాణాలు ఉన్నప్పటికీ మిగిలిన ఖాళీ స్థలాలను పరిరక్షించాల్సిన రెవెన్యూ అధికారులు ఆయా ఖాళీ స్థలాలు కూడా ఆక్రమణకు గురవుతున్నా చూస్తూ ఉండిపోయారు. క్షేత్రస్థాయిలో చిత్తశుద్ధితో పనిచేసిన రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలాలను గుర్తించి అందులో బోర్డులు ఏర్పాటు చేశారు. ఆక్రమణదారులపై కేసులు నమోదు చేశారు. కానీ తదనంతరం రాజకీయ జోక్యం, ఉన్నతాధికారుల ఉదాసీనత ఫలితంగా పదుల ఎకరాల్లోని ప్రభుత్వ భూములు ఆక్రమణదారుల సొంతమైన సంఘటనలు మండలంలో అనేకం ఉన్నాయి.

పరిరక్షణలో వీడని నిర్లక్ష్యం...

ఇల్లెందు పట్టణం నడిబొడ్డున గోవింద్ సెంటర్‌లో పూర్వం నుంచి అటవీశాఖ ఆధీనంలో అనధికారికంగా 20 ఎకరాల రెవెన్యూ స్థలం ఉంది. అందులో సుమారు రెండు ఎకరాల విస్తీర్ణం అన్యాక్రాంతం కాగా మిగిలిన 18 ఎకరాల విస్తీర్ణంలో 12 ఎకరాల స్థలాన్ని మండలంలోని తుంటుబాలు తండా నుంచి పోచారం తండా వరకు బీటీ రోడ్డు నిర్మాణం కోసం అటవీశాఖ కోల్పోతున్న భూమికి ప్రత్యామ్నాయంగా రెవెన్యూ శాఖ అటవీశాఖకు అప్పగించింది. అయినా ఇంకా అటవీశాఖ కాంప్లెక్స్ పరిధిలో ఆరు ఎకరాల విస్తీర్ణంలో రెవెన్యూ భూమి మిగిలి ఉంటుంది. ఆయా స్థలాన్ని సర్వే చేసి స్వాధీనం చేసుకోవడం ద్వారా ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ఇతర సంక్షేమ పథకాలకు వినియోగించుకోవాల్సిన రెవెన్యూ అధికారులు అది తమ పనికాదన్నట్లుగా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. ఇలాంటి స్థలాలు పట్టణంలో, మండలంలోని పలు ప్రాంతాలలో ఉన్నప్పటికీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో క్రమంగా ఆక్రమణలకు గురై రాజకీయ అండదండలు ఉన్న వారికి కాసులు కురిపిస్తున్నాయి.

ప్రభుత్వ స్థలాలను గుర్తిస్తున్నాం..



సమీకృత గురుకులాల నిర్మాణానికి అవసరమైన స్థలం కోసం వెతుకుతున్నాం. రెవెన్యూ, అటవీశాఖ పరిధిలో ఉన్న భూమిని జాయింట్ సర్వే ద్వారా గుర్తించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. త్వరలోనే ప్రక్రియ పూర్తిచేసి 25ఎకరాల స్థలాన్ని అప్పగిస్తాం.

– రవికుమార్, తహసీల్దార్, ఇల్లెందు

జేకే ఓసీ పనులపై సమీక్ష



మాట్లాడుతున్న ఏరియా జీఎం జాన్‌ఆనంద్

ఇల్లెందు: ఇల్లెందు మనుగడ ప్రశ్నార్థకమైన తరుణంలో జేకే ఓసీ విస్తరణకు అనుమతులు లభించడంతో మరో 12 ఏళ్ల పాటు పురిటి గడ్డ ఇల్లెందులో సింగరేణి భవితవ్యానికి డోకా లేదు. అటవీశాఖ అనుమతులు లభించిన నేపథ్యంలో ఏరియా జీఎం జాన్‌ఆనంద్ గురువారం ఇల్లెందులోని సింగరేణి వివిధ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పట్టణంలోని 24 ఏరియా ఆఫీసర్స్ క్లబ్‌లో ఉన్నతాధికారులతో జరిగిన సమావేశంలో జేకే ఓసీ పనుల పురోగతిని సమీక్షించారు. జేకే–5 ఓసీ, 21 ఇంక్లైన్ కలుపుతూ ఏర్పడబోయే నూతన జేకే ఓసీ సంబంధించిన 151.85 హెక్టార్ల అటవీ భూమి వాడకానికి సూత్రప్రాయంగా అటవీశాఖ కేంద్ర పర్యావరణ శాఖ వాతావరణ మార్పు శాఖ వారు అనుమతి ఇచ్చినందున ఓసీ ఏర్పాటు పనులు ముమ్మరం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా నూతన జేకే ఓసీ కోసం ఉద్యోగులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం బొల్లం వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక పారదర్శకంగా ఉండాలి



మాట్లాడుతున్న చందర్‌రావు

జూలూరుపాడు: ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక పారదర్శకంగా జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు వల్లమల్ల చందర్‌రావు డిమాండ్ చేశారు. గురువారం గుండెపుడి గ్రామంలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లకు అర్హులైన నిరుపేదలను ఎంపిక చేయాలన్నారు. బానోత్ మధు, ఇల్లంగి సీతారాములు, గడిదేశి కనకరత్నం, ఇస్లావత్ భద్రు, యశ్వంత్, తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: ఇందిరమ్మ ఇళ్ల పేరుతో అధికార పార్టీ వారి నాయకులతోనే కమిటీలు వేయడం ఇతర పార్టీల వారిని విస్మరిస్తున్నారని, కాంగ్రెస్ కమిటీలా.. గృహలక్ష్మి కమిటీలా.. చెప్పాలని ప్రగతిశీల మహిళ సంఘం (పీఓడబ్ల్యూ) జిల్లా ఉపాధ్యక్షురాలు సోమా వినోద అన్నారు. రెడ్డిగూడెం గ్రామంలో గురువారం కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రమిల, మల్లమ్మ, రజిత, ఎల్లమ్మ, ఉప్పమ్మ, అశోక్‌రెడ్డి, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా నియమించిన కమిటీలల్లో మైనారిటీలకు ప్రభుత్వం మొండి చేయి చూపించిందని జిల్లా మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎండీ. యాకూబ్‌పాషా గురువారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. కమిటీలలో మైనారిటీలను సభ్యులుగా నియమించకుండా అన్యాయం చేశారని పేర్కొన్నారు. నిరుపేద మైనారిటీలకు అన్యాయం జరిగే అవకాశం ఉందని తెలిపారు.

మెరుగైన వైద్యం అందించండి..

పాల్వంచ: పాల్వంచ ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులను నియమించాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గంధం మల్లికార్జునరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పార్టీ ఆధ్వర్యంలో ఆరోగ్య కేంద్రం ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపారు. మాట్లాడుతూ.. ఆస్పత్రికి రోజుకు 600 మందికి పైగా రోగులు వస్తుండగా ఉన్న 50 బెడ్లు సరిపోవడం లేదని, అంబులెన్స్ లేదన్నారు. డయాసిస్ కేంద్రానికి సిబ్బందిని, మందులు సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో కోళ్లపూడి ప్రవీణ్ కుమార్, టంగు శ్రీనివాస్, కటికల రంజిత్, నాగరాజు, రమేష్, రాము పాల్గొన్నారు.

చిరుద్యోగులపై ఆధిపత్యం సరికాదు..



జిల్లా వ్యవసాయాధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఏఈఓలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): డిజిటల్ క్రాప్ సర్వే ప్రారంభించకపోతే కాంట్రాక్ట్ ఏఈఓలను ఉద్యోగం నుంచి తొలగిస్తామని ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేయడం తగదని, కక్షపూరిత చర్యలు మానుకోకపోతే రాష్ట్ర వ్యాపితంగా నిరవధిక సమ్మె చేస్తామని ఏఈఓల సంఘం నాయకులు హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని జిల్లా వ్యవసాయాధి కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలో 67 మంది ఏఈఓలలో తొమ్మిది మంది కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నట్లు చెప్పారు. అల్పజీవులపై అధికారుల ఆధిపత్య ధోరణి తగదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర రాష్ట్రాలలో తాత్కాలిక పద్ధతిన వెయ్యి ఎకరాలకు ఒకరి చొప్పున నియమించి శిక్షణ ఇచ్చి సర్వే చేయిస్తుంటే తెలంగాణలో మాత్రం నియమించకపోవడం దారుణమన్నారు. ఈ విధానాలను మార్చుకోకపోతే నిరవధిక సమ్మె తప్పదని హెచ్చరించారు. అనంతరం జిల్లా వ్యవసాయాధికారి వి.బాబారావుకు వినతిపత్రం అందజేశారు. బందెల నరసింహారావు, పర్సా శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించండి..

టేకులపల్లి: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్‌నబీ కోరారు. ఈ మేరకు గురువారం సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ టేకులపల్లి ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. సీడీపీఓ కేఎం తారకు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో నాలుగు వేల మంది అంగన్‌వాడీ టీచర్లకు ఐదు నెలల వేతనాలను తక్షణమే చెల్లించాలని, వీరికి పూర్తి వేతనం చెల్లించే విధంగా ఆర్థిక శాఖ ట్రెజరరీలో అప్‌డేట్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి శకుంతల, అనసూర్య, శ్రావణి, జయ శ్రీ, కోటమ్మ, వెంకట నర్సమ్మ, రాంబాయి, సరిత, అరుణ కుమారి, సరిత, సత్యవతి, లీలావతి, అన్నపూర్ణ, రాణి, సుభద్ర, సుజాత, సుశీల, జై చిత్ర తదితరులు పాల్గొన్నారు.



ఇల్లెందురూరల్: ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

ఇల్లెందురూరల్: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం ఐసీడీఎస్ ఇల్లెందు ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సీడీపీఓ అరుణకు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబీ మాట్లాడుతూ.. ప్రభుత్వం తక్షణం స్పందించి ఉత్తర్వులకు అనుగుణంగా అంగన్‌వాడీ టీచర్ల విధులను ఆర్థిక శాఖలో అప్‌డేట్ చేసి వేతనాలను పూర్తిస్థాయిలో మంజూరు చేయాలని కోరారు. లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తాళ్లూరి కృష్ణ, కల్లేపల్లి మరియ, రాంబాయి, షేక్ ఫాతిమా, సుజాత, వెంకటమ్మ, శ్రీలత, కుమారి, దేవమణి పాల్గొన్నారు.

నిర్వాసితులుగా ప్రకటించే వరకు ఉద్యమిస్తాం..



ధర్నా చేస్తున్న కుమ్మరి బస్తీ ప్రజలు

ఇల్లెందురూరల్: తమ ప్రాంతాన్ని నిర్వాసిత జాబితాలో చేర్చే వరకు ఉద్యమిస్తామని మండలంలోని కుమ్మరి బస్తీ ప్రజలు గురువారం తహసీల్ ఎదుట ధర్నా చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ రవికుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా తిలక్‌నగర్ మాజీ సర్పంచ్ ధనసరి స్రవంతి మాట్లాడుతూ.. 21పిట్ ఏరియాలో నిర్వాసిత గృహాలను గుర్తించే క్రమంలోనే తమ నిరసనను సింగరేణి యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లామన్నారు. తాజాగా అనుమతులు మంజూరు కావడంతో పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోందని చెప్పారు. ఎప్పుడు కూలిపోతాయో తెలియని స్థితిలో ఉన్న ఇళ్లల్లో నివాసం ఉంటున్నామని, ఏళ్లుగా మరమ్మతులకు కూడా చేసుకోనివ్వడం లేదని వాపోయారు. ఇక్కడి నేటికీ భూమిలో నుంచి విష వాయువులు వెలువడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. యాజమాన్యం స్పందించి తమను నిర్వాసితులుగా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో ధనసరి రాజు, పోతురెడ్డి సారంగపాణి, సింగారపు శ్రీను, సింగారపు హరీష్, అవినాష్, మహేష్, ఎల్లాబాయి, తులసి, మున్ని, రాజేశ్వరి, సోమయ్య, మల్లయ్య, సుమలత, జ్యోతి, సత్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓగా జుంకీలాల్

జూలూరుపాడు: జూలూరుపాడు మండల విద్యాశాఖ అధికారిగా పడమటనర్సాపురం హైస్కూల్ హెచ్ఎం బానోత్ జుంకీలాల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత ఎంఈఓ గుగులోత్ వెంకట్ ఖమ్మం జిల్లా కామేపల్లి మండలానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా జుంకీలాల్‌ను ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ధరావత్ హనుమా, మాలోత్ లక్ష్మణ్, హలావత్ నరసింహారావు, ధరావత్ భాస్కర్, బి.నేతాజీ, డి.స్వరూప, సీతారాములు, కృష్ణ నాయక్, కిరణ్, మోహన్ పాల్గొన్నారు.

విధుల్లో చేరిన ఏడీఈ

సుజాతనగర్: చంద్రుగొండ, సుజాతనగర్, జూలూరుపాడు, అన్నపురెడ్డిపల్లి మండలాలకు ట్రాన్స్‌కో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ (ఏడీఈ)గా ఎం.రవికుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో సుజాతనగర్‌లోని ఏడీఈ కార్యాలయంలో స్థానిక విద్యుత్ సిబ్బంది రవికుమార్‌కు ఘనంగా స్వాగతం పలికారు. శాలువాలు, పూలబొకేలతో సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఏఈలు కిషన్, సతీష్, నరసింహ, తరుణ్, సిబ్బంది శివకుమార్ పాల్గొన్నారు.

23న ఇసుక వేలంపాట

పాల్వంచరూరల్: అక్రమంగా రవాణా చేస్తుండగా పోలీసులు సీజ్ చేసిన 144 క్యూబిక్ మీటర్ల కలిగిన ఎనిమిది ట్రక్‌ల ఇసుకను ఈ నెల 23న తహసీల్దార్ కార్యాలయంలో ఉదయం 11గంటలకు బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వివేక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగినవారు వేలంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

ఎస్టీ వర్గీకరణకు కమిషన్ నియమించండి..



ర్యాలీ నిర్వహిస్తున్న తుడుందెబ్బ నాయకులు

ఇల్లెందు: ఎస్సీ వర్గీకరణ తరహాలోనే ఎస్టీ వర్గీకరణ కోసం కమిషన్ నియమించాలని తుడుందెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య డిమాండ్ చేశారు. కొమురం భీమ్ 84వ వర్ధంతి సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని బీట్ మార్కెట్ నుంచి కొత్త బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. భీమ్ విగ్రహానికి ఆదివాసీ నేతలు వట్టం కన్నయ్య, వాసం రామకృష్ణలతో కలిసి సీఐ బత్తుల సత్యనారాయణ చేతుల మీదుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకు ముందు జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య తుడుందెబ్బ జెండాను ఎగుర వేశారు. లక్ష్మయ్య మాట్లాడుతూ.. నేడు ఆదివాసీ సమాజానికి ప్రమాదం ముంచుకొచ్చిందన్నారు. ఆదివాసీల వనరులు, అడవులు, సంపద బ్రిటీష్ కాలం నుంచే కొల్లగొట్టబడ్డాయన్నారు. ఆనాడే ఆదివాసీలు జల్ – జంగిల్ – జమీన్ అనే నినాదంతో పోరాటం చేశారని గుర్తుచేశారు. ఈ కోవలోనే సంతాల్, కొమురం భీమ్ పోరాటాలు జరిగాయన్నారు. ఈ సమావేశంలో ధనసరి రామ్మూర్తి, వట్టం కన్నయ్య, పూనెం బాలకృష్ణ, పూనెం సూర్యనారాయణ, దుర్గారావు, వీరభద్రం, వరుస పుల్లయ్య, పెనక మంగయ్య, ఈసం కృష్ణ, సూర్ణపాక రామారావు, మునేశ్వర రావు, కుమార్ పాల్గొన్నారు.

ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలి

ఇల్లెందు: ఎస్టీ జాబితా నుంచి అక్రమంగా కలిపిన లంబాడీలను తక్షణమే తొలగించాలని తుడుందెబ్బ రాష్ట్ర కోకన్వీనర్ ముక్తి రాజు డిమాండ్ చేశారు. గురువారం ఇల్లెందు మండలం ఒడ్డుగూడెంలో కొమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. లంబాడీల వల్ల ఎస్టీలకు అన్యాయం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో పొదెం రామ్మూర్తి, తాటి మధు, స్వామి, తాటి రామారావు, మోకాళ్ల సతీస్, కోటేశ్వరరావు, రామ్‌కుమార్ పాల్గొన్నారు.

నేటి యువతకు భీం స్ఫూర్తి..

జల్ – జంగల్ – జమీన్ నినాదంతో అడవి బిడ్డల స్వేచ్ఛా స్వాతంత్ర్యం, ఆదివాసీల స్వయం పాలన కోసం, కుమురం భీం చేసిన పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఆయన అడుగు జాడల్లో నడవాలని ఆదివాసీ నాయకులు కోరారు. భీం వర్ధంతి సందర్భంగా గురువారం ఆదివాసీ సంఘాలు, ప్రభుత్వ విద్యాలయాల్లో ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ.. ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలు, హక్కుల పరిరక్షణ కోసం భీం స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. – సాక్షి నెట్‌వర్క్



ఇల్లెందురూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నివాళులర్పిస్తున్న అధ్యాపకులు



పాల్వంచరూరల్: రాజాపురంలో...

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి



కొత్తగూడెంఅర్బన్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో...



సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి హెడ్డాఫీసులో మాట్లాడుతున్న డైరెక్టర్ సత్యనారాయణరావు



టేకులపల్లి: బోడు గ్రామంలో..

కొత్తగూడెంఅర్బన్: ఆదికవి వాల్మీకి మహర్షి జీవిత చరిత్రను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని గ్రంథ పాలకురాలు జి.మణిమృదుల అన్నారు. వాల్మీకి జయంతిని జిల్లా గ్రంథాలయ సంస్థ ఆవరణలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మణిమృదుల మాట్లాడుతూ.. ఒక సామాన్య వ్యక్తిగా పుట్టి సప్తరుషుల బోధనల ద్వారా మహర్షి వాల్మీకిగా మారి అద్భుతమైన రామాయణ గ్రంథాన్ని మనకు అందించిన మహనీయుడు వాల్మీకి అని ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని పేర్కొన్నారు. కృషి ఉంటే మనుషులు రుషులవుతారు.. మహా పురుషులవుతారు అనే దానికి వాల్మీకి జీవిత చరిత్ర నిదర్శనం అన్నారు.

సింగరేణి(కొత్తగూడెం): వాల్మీకి వలె ప్రతీఒక్కరు తమలోని నైపుణ్యాన్ని వెలికి తీసి, చెడును వదిలేయాలని సింగరేణి డైరెక్టర్ ఈఅండ్ఎం సత్యనారాయణరావు అన్నారు. గురువారం సింగరేణి ప్రధాన కార్యాలయం, ఏరియాలోని జీఎం కార్యాలయంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కార్పొరేట్ సీఎంఓఏఐ అధ్యక్షుడు ఎం.విజయభాస్కర్‌రెడ్డి, బీసీ వెల్ఫేర్ లైజనింగ్ ఆఫీసర్ హరిశంకర్, జీఎం సీపీపీ ఏ.మనోహర్, జీఎం హెచ్ఆర్‌డీ వి.కృష్ణయ్య, జీఎం ఈఅండ్ఎం రఘురామిరెడ్డి, జీఎం వెల్ఫేర్ సామ్యూల్ సుధాకర్, జీఎం టెక్నికల్ సర్వీసు సోమయాజులు, అధికారులు పాల్గొన్నారు.

టేకులపల్లి: సంస్కృత ఆదికవి, శ్రీరామాయణ మహాకావ్యాన్ని రచించిన మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు గురువారం టేకులపల్లి మండలంలోని బోడు గ్రామంలో ఘనంగా జరుపుకున్నారు. బోయ వాల్మీకి కులస్తుల ఆధ్వర్యంలో వాల్మీకి చిత్రపటంతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఆటపాటలతో సందడి చేసి, సహపంక్తి భోజనాలు చేశారు.